క్లుప్తంగా

ఆంజనేయస్వామికి గద బహూకరణ



గదతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: జాలిమంచి గ్రామంలో కొలువై ఉన్న సిద్ధాపురం ఆంజనేయస్వామికి భక్తులు రూ.3.51 లక్షలు విలువైన మూడు కేజీలో వెండి గదను చేయించారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తన వంతుగా రూ.10 వేలు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం గదను ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయ నిర్వాహకు లు మాజీ ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ కప్ట్రాళ్ల శాంతకుమార్, నాయకులు, జాలిమంచి గ్రామస్తులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: వర్షాల నేపథ్యంలో పట్టణంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ హెచ్చరించారు. ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే వారి కోసం హెల్ప్ డెస్క్ నంబర్ 70325 75929ను సంప్రదించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరినా, ఇళ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నా ప్రజలు పునరావాస కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

రేపటి నుంచి రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం నుంచి మంత్రాలయం మఠం శ్రీ రాఘవేంద్రస్వామి వారి 354వ ఆరాధన మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయని ఆలయ మేనేజర్ భీమసేన శుక్రవారం తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థ ఆదేశాల మేరకు మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం సామూహిక సత్యనారాయణవ్రతం, ధ్వజారోహణం, గోపూజలతో ప్రారంభమై ఆదివారం క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, తులసీ అర్చన, కనకాభిషేకం, రథోత్సవం, ఉంటాయన్నారు. సోమ, మంగళవారాల్లో కూడా స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు తీర్థ ప్రసాదాలు సమర్పిస్తారన్నారు.

పీడీకి సన్మానం



పీడీ రాజారాంమోహన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పదోన్నతిపై పత్తికొండ ఎంఈఓగా బదిలీ అయిన పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ రాజారాంమోహన్ శుక్రవారం సన్మానించారు. స్థానిక పాఠశాలలో తోటి ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులతో పాటు ఫ్రెన్స్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు వహబ్‌లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రాజారాంమోహన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు హనీఫ్, సుజనకుమారి, శిరీష, నర్సింహరాజు, వెంకటేష్, శ్రీను, రామన్న, బసవరాజు, శ్రీరామ్, ఈరన్న, ఆనంద్, ఉపాధ్యాయులు చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న గౌరవ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి

ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదోని ప్రైవేట్ పాఠశాలల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక అక్షరశ్రీ పాఠశాలలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గోపాల్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. ఈ ఎన్నికల్లో గౌరవ సలహాదారులుగా కేశవనారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి అధ్యక్షుడుగా నాగేంద్ర ప్రధాన కార్యదర్శిగా కృష్ణమూర్తి ఆర్థిక కార్యదర్శిగా దశరథ రాముడు ఉపాధ్యక్షులుగా నాగరాజ్, ఉసేనప్ప, హరి పాండురంగ జాయింట్ కార్యదర్శులుగా అఫ్జల్ రెహమాన్, రమేష్ బాబు,వినోద్ రెడ్డి సభ్యులుగా వెంకటేశులు, జనార్దన్, రాజశేఖర్, నాగరాజ్, గోవిందరాజులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు మేఘనాథ్ రెడ్డి, తిప్పయ్య, రీనా, పవిత్ర, రాము, హుసేనప్ప, కంబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు కాదు రోడ్లు



వ్యవసాయ మార్కెట్‌యార్డు రోడ్డులో గుంత పెద్ద ఏర్పడిన దృశ్యం



దారి అంతా గుంతలే..



మాధవరం రోడ్డులో పెద్ద గుంతగా మారి చెరువుగా తలపిస్తున్న మురుగునీరు

ఆదోని అర్బన్: పాలకుల అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం వెరసి ప్రజల అగచాట్లు అన్నీఇన్నీ కావు. ఇటీవల పట్టణంలో కురిసిన భారీ వర్షానికి పట్టణం జలయమై రహదారులు ఛిద్రమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. గుంతలు పడిన రహదారుల్లో వర్షపు నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. స్థానిక మాధవరం రోడ్డు, వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే రోడ్డులో వెళ్లేందుకు వాహనదారులు జంకుతున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారుల్లో మూడు పెద్ద గుంతలు దర్శనమిస్తాయి. యార్డుకు రైతులు వ్యవసాయ దిగుబడులు తెచ్చే సమయం ఆసన్నమయ్యింది. దిగుబడులుతో వచ్చే వాహనాలు ఇరుక్కుపోవడంతో పాటు అదుపు తప్పే ప్రమాదం ఉన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ప్రతిరోజూ అటువైపు వెళ్లే మున్సిపల్ అధికారులు, వ్యవసాయ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలని రైతులు, ప్రజలు, మార్కెట్ ఏజెంట్లు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్టోత్సవం



మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, గ్రామస్తులు



ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి

ఆదోని రూరల్: పాండవగల్లు గ్రామంలో శ్రీ బాట లక్ష్మమ్మదేవి విగ్రహ ప్రతిష్టాన మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆదోని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణ దశలో ఉండగా రూ.లక్షను విరాళంగా ఆలయ కమిటీకి మాజీ ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయ అభివృద్ధికి ముమ్ముందు కూడా తన వంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, గురునాథ్‌రెడ్డి, ఎర్రిస్వామి, మాజీ డీలర్ చిన్నోడు, భీమ, చిన్నగిడ్డయ్య, హనుమంతరెడ్డి, హనుమంతు, చిన్నారెడ్డి, హుస్సేన్‌బాషా, విశ్వనాథ్, వీరాంజనేయులు, పూజారి శంకర్‌రెడ్డి, గజేంద్రరెడ్డి, చిన్నస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రాలయం రూరల్: మంత్రాలయంలోని మాలపల్లి గ్రామంలో శ్రీతాయమ్మవ్వ, 52–బసాపురంలోని దేవమ్మవ్వల విగ్రహ ప్రతిష్టాపనలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య విగ్రహాల ప్రతిష్టాపన చేపట్టారు. గ్రామంలో పిండి వంటలు చేసుకుని అమ్మవార్ల పూజల్లో ఆయా గ్రామాల ప్రజల తరించారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మాలపల్లి తాయమ్మవ్వ ఆలయానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. అలాగే బసాపురం వేడుకల్లోనూ ఆయన పాల్గొని పూజలు చేసుకున్నారు.

ఆర్డీటీ కాలనీలో సౌకర్యాలు కల్పించండి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం బృందం

కౌతాళం: ఎరిగేరి గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం బృందం నాయకులు డిమాండు చేశారు. శుక్రవారం కాలనీలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ ఈరన్న, నాయకులు వీరేష్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్డీటీ కాలనీలో జలయమం అయ్యిందని, కొందరి ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి నేతలు స్పందించి ఆర్డీటీ కాలనీలో గ్రావెల్ వేసి ఇళ్ల ముందు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండు చేశారు. ఈ విషయంలో నాయకులు, అధికారులు స్పందించకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. వారి వెంట వెంకటేష్, ఉలిగయ్య, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం సుధాకర్ బాబు, పీఈటీ దుబ్బన్న

పెద్దకడబూరు: కల్లుకుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుదాకర్ బాబు, పీఈటీ దుబ్బన్న తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలులో బుధవారం నిర్వహించిన సబ్ జూనియర్ జూడో పోటీలలో తమ పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి నరేంద్ర, 8వ తరగతి విద్యార్థులు కార్తీక్, ఉపేంద్ర, సాగర్, 9వ తరగతి విద్యార్థి రాజ్‌కుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎన్నికైనట్లు వారు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలన్నారు.

సంక్షిప్తం

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

ఆదోని టౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు తనిఖీ చేశారు. బస్‌స్టేషన్‌లో ఉన్న సౌకర్యాలను పరిశీలించి, రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 15వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్న నేపథ్యంలో సమయానికి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను సూచించారు. బస్టాండ్ ప్రహరీకి ప్రతిపాదనలు పంపాలన్నారు. అనంతరం డిపో గ్యారేజ్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బస్సుల ఫిట్‌నెస్‌పై నిరంతర పర్యవేక్షణ అవసరమని సూచించారు. బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు చెత్తరహితంగా ఉండేలా మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈయన వెంట ఆదోని డిపో మేనేజర్ రఫిక్ తదితరులు ఉన్నారు.

12న పట్టుబడిన వాహనాలకు వేలాలు

ఎమ్మిగనూరురూరల్: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పట్టుబడిన వాహనాలకు ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలాలు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ స్థానిక ఎక్సైజ్ కార్యాలయం అవరణలో వివిధ కేసుల్లో పట్టుబడిన 25 వాహనాలను జిల్లా ఎక్సైజ్ అధికారి ఆధ్వర్యంలో వేలాలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: రెండో శనివారం సందర్భంగా విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లోకేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆదోని పట్టణమంతా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

గోనెగండ్ల: విద్యతోనే ఉన్న శిఖరాలు సాధ్యమని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు అన్నారు. గోనెగండ్ల బీసీ బాలికల హాస్టల్‌లో శుక్రవారం ఫ్రెషర్స్ డే, తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికంతో చదువుకు ఎవరు దూరం కాకూడదని ఉద్దేశంతోనే ప్రభుత్వాలు హాస్టళ్లను ఏర్పాటు చేశాయని తెలిపారు. అనంతరం విద్యార్థినిలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కండేయ స్వామి ఉత్సవాలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని వెలసిన పద్మశాలి కులబాంధవుల ఆరాధ్య దైవం శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆంజనేయులు, ఆలయ కమిటీ బృందం తెలిపారు. శనివారం సాయంత్రం తుంగభద్ర నది జలాలు ఊరేగింపుగా తీసుకురావడం, ఆదివారం స్వామి వారికి జలాభిషేకం, సోమవారం గ్రామోత్సవం నిర్వహించనున్నారు.







ఎమ్మిగనూరులో పూజలందుకున్న వాసవీ కన్యకాపరమేశ్వరి, ప్రత్యేక అలంకరణలో వేదగాయత్రీ మాత, నందవరంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

వరాల తల్లీ.. అనుగ్రహించు!



ఉరుకుందలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతాలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. అష్టోతర శతమానాలతో వరలక్ష్మీదేవిని పూజించి షడ్రషోపేతమైన మహా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంట్లో ఉన్న సమస్యలను తొలగించి కుటుంబాన్ని కాపాడాలని మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. పున్నమి చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరిండంతో ఈ శ్రావణ మాసానికి ఇంతటి విశిష్టత ఉందని పురోహితులు తెలిపారు. ఎమ్మిగనూరు స్థానిక వాసవీ కన్యాకాపరమేశ్వరి దేవాలయం, వేదగాయిత్రీ ఆలయంతో పాటు అంబాభవాని, గజ్జలమ్మ, సుంకులపరమేశ్వరి, మహాలక్ష్మి దేవాలయాల్లో అమ్మవార్లకు పూజలు చేపట్టారు. ముత్తయిదువులు ఒకరినొకరు వాయినాలు ఇచ్చుపుచ్చుకున్నారు. గోనెగండ్లలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రతం వైభవంగా సాగింది. ప్రత్యేకంగా తెచ్చిన గాజులతో వరలక్ష్మిని అమ్మవారిని సుందరంగా అలంకరించారు. వరలక్ష్మి వ్రతంను దేవాలయంలో కుంభాభిషేకం తర్వాత మొదటి సారి వైభవంగా చేపట్టారు. ఈపూజ కార్యక్రమంలో వేలాది భక్తులు తరలివచ్చి అమ్మవారి సన్నిధిలో మొక్కులు తీర్చుకుని పూజలు చేశారు. వైఎస్సాఆర్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి కుటుంబ సమేతం వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయం, నందవరం మండల కేంద్రంలో విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో మంత్రాలయం, నందరం ప్రఖండలోని ఖండ కసిరెడ్డి రజిత నేతృత్వంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.



గోనెగండ్లలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

- ఆదోని డీఎస్పీ హేమలత



మాదక ద్రవ్యాలనిషేధంపై అవగాహన కల్పించే వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: యువత మత్తు పదార్థాల జోలికెళ్లొద్దని ఆదోని డీఎస్పీ హేమలత సూచించారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని రోషన్ గార్డెన్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, దానివల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఒత్తిడిని జయించేందుకు అనేక మార్గాలు ఉన్నాయన్నారు. కళాశాల యాజమాన్యాలు చదువుతో పాటు, సాంస్కృతిక, క్రీడలను ప్రోత్సహించాలని, పాఠశాలలు, కళాశాలలకు వంద మీటర్ల లోపు సిగరెట్లు, మద్యం వంటివి విక్రయించరాదన్నారు. ఈ నిబంధనను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలను వినియోగించినా, విక్రయించినా నేరమేనన్నారు. కేసు నమోదైతే పదేళ్లకు పైబడి జైలు జీవితంతో పాటు, రూ.లక్షకు పైగా జరిమానా ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ నల్లప్ప, ఎస్‌ఐలు రామాంజనేయులు, మహేష్‌కుమార్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నట్టేట ముంచడం బాబు నైజం



చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దకడబూరు: అబద్ధపు హామీలతో గద్దెనెక్కి గెలిపించిన వారిని నట్టేట ముంచడం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం రెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని.. గవిగట్టు, పీకలబెట్ట, బాపుల దొడ్డి, హులికన్వి గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి 14 నెలలో అధికారంలో ఉన్నా కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమేర నష్టం చేసిందో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో గద్దెనెక్కి హామీలను గాలికి వదిలేయడం బాబుకి పరిపాటిగా మారిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజలపై దాడి చేయించడంతో పాటు అక్రమ కేసులు బనాయించడం తప్పా ఏమి చేయలేదన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకు పింఛన్ వంటి ప్రధాన పథకాలపై నోరు మెదపడం లేదని మండి పడ్డారు. ఇకనైనా ప్రజలు బాబు నిజస్వరూపాన్ని గమనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి ఈరన్న, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ఎల్లప్ప, పబ్లిసిటీ వింగ్ విభాగం డివిజన్ అధ్యక్షుడు ముక్రన్న, నాయకులు అర్లప్ప, మూకిరెడ్డి, అయ్యప్ప రెడ్డి, మహాదేవా ,ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు ప్రారంభం




కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కడపాళెం, సిద్దప్ప పాళెం కాలనీలలో వెలసిన తొగట వీరక్షత్రియుల ఆరాధ్య దైవం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గోవిందు స్వామి ఆధ్వర్యంలో ఆయా ఆలయాల కమిటీ అధ్యక్షులు ఓంప్రకాష్, డీసీ నారాయణ సమక్షంలో అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాబిషేకం, ఆకు పూజ, మహామంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం తుంగభద్ర నది జలాలు, జ్యోతులను, మేళతాళాలు, డప్పువాయిద్యాలు, కలశాలతో ఊరేగింపుగా బయలుదేరి ఆలయం చెంతకు చేరుకున్నారు. శనివారం వేకువ జామున అమ్మవారి స్వగృహం నుంచి జ్యోతిలను వెలిగించుకుని భజన పాటలతో ఊరేగింపుగా జ్యోతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బృందం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.



గోపూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

సంబరం.. సుమధురం



ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు



ధాన్య పూజలో పీఠాధిపతి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి సన్నిధిలో సంబరాలు సుమధురంగా సాగాయి. శుక్రవారం ఉత్సవాలు ప్రారంభంలో భాగంగా పూజా ఘట్టాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా ధర్మవరానికి చెందిన లలితా నికేతన్ బృందం కూచిపూడి నాట్య ప్రదర్శన, కర్నాటకలోని మాలూరుకు చెందిన ప్రసన్న కూర్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకున్నాయి. అలాగే శ్రీమఠం ఊంజల మంటపంలో చేపట్టిన ధాన్య పూజ భక్తులను మైమరిపించింది. రాఘవేంద్రస్వామి అనుగ్రహంతో సప్తరాత్రోత్సవాలను జయప్రదం చేద్దామని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పిలుపునిచ్చారు. స్వామి సేవలో భక్తకోటి తరించాలని ఆకాంక్షించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. అలాగే ఆరాధనోత్సవాల విశేషాలను భక్తులకు ప్రవచించారు.

అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలి

ఆదోని రూరల్: కేవీఆర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ లాలప్ప అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని డీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలప్ప అవినీతి, నిధులపై విచారణ చేపట్టి రికవరీ చేయాలన్నారు. లాలప్ప 13 సంవత్సరాలుగా పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయన అక్రమంగా వసూలు చేసిన ఫీజులను రికవరీ చేసి కాలేజీ అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఆదోని డివిజన్‌లో మోస్తరు వర్షం

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్‌లో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా ఆదోని మండలం 59.4 మి.మీ, అత్యల్పంగా నందవరం మండలంలో 5.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కౌతాళం మండలంలో 38.4 మిల్లీ మీటర్లు, కోసిగిలో 13.2, గోనెగండ్లలో 12.6, పెద్దకడబూరులో 11.4, ఎమ్మిగనూరులో 8.8, మంత్రాలయంలో 8.4 మి.మీ వర్షం కురిసింది.